# రివర్స్ గేర్

- ఎ.కె.వి. రత్నమాల

గోడగడియారం కొట్టిన గంటల శబ్దానికి అదిరిపడి మేల్కొంది గాఢనిద్రలో వున్న ఆమె. అప్రయత్నంగా వాల్‌క్లాక్ వైపు చూసింది. అర్ధరాత్రి పన్నెండు. దిగ్గున మంచం మీంచి లేచికూర్చుంది.

లోలోపల ఏదో భయం. ఒంటినిండా స్వేదం. గుండెలో దడ! అప్పటికే గొంతు పిడచకట్టుకుపోయి నోరు తడారిపోయింది. మంచినీళ్ళు తాగాలనిపించింది. కానీ భయం! ఎలాగో లేని ధైర్యం తెచ్చుకుని లేచి బెడ్‌రూంలో ఓ మూలగా ఉన్న టీపాయ్‌వైపు చూసింది. అక్కడ, పడుకోబోయే ముందు తను పెట్టిన వాటర్ జగ్ లేదు. గుండె ఝల్లుమంది. మంచి నీళ్ళు లేనందుకు కాదు, వాటికోసం కిచెన్ వరకూ వెళ్ళాల్సి వచ్చినందుకే!

వెళ్ళాలా, వద్దా? ఒక్కక్షణం సందిగ్ధం. వెడితే ఏ క్షణాన ఏం జరుగుతుందో? అనుమానం! వెళ్ళక పోతే, దాహంతో ప్రాణం పోతుందేమో! భయం!! ఏం చెయ్యాలో అర్థం కాలేదు. దాహం మరింత పెరిగింది. ధైర్యం కూడగట్టుకుని బెడ్‌రూమ్ తలుపు తీసుకుని బయటికి వచ్చింది.

ఒక్కక్షణం... నలుమూలల్నీ పరికించి చూసింది. ఎక్కడా అనుమానాస్పద పరిస్థితులేవీ కనపడలేదు. గాఢంగా నిట్టూర్చి మెల్లగా కిచెన్‌లోకి వెళ్ళింది. మంచినీళ్ళు తాగేసి కిచెన్ తలుపైనా వేయకుండా గబగబా వచ్చేసింది.

మంచం మీద వాలబోతూంటే... రివ్వున వీచిన గాలి కిటికీలోంచి దూసుకొచ్చి విసురుగా ఆమె శరీరాన్ని తాకింది. ఒళ్ళు జలదరించింది. చప్పున వెళ్ళి కిటికీలోంచి బయటికి చూసింది. అక్కడంతా కారు చీకటి! దూరంగా, కొరివిదయ్యాల్లా అక్కడో లైటూ, ఇక్కడో లైటూ!

నలుదిశలా స్మశాన నిశ్శబ్దం ఆవరించుకుంది. ఆ నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ ఎక్కడో గుడ్లగూబ కూసింది. ఆమెకి గుండె ఝల్లుమంది. రక్కున కిటికీ తలుపులు వేసేసింది. ఆ క్షణంలో తనకి తాను





## సెకండ్ బ్రిడ్జి

అస్సాంలో బ్రహ్మపుత్రా నదిమీద ఎనభై తొమ్మిది కోట్లతో నిర్మించబడిన కొలి యాభొమెరా బ్రిడ్జి భారతదేశంలో రెండో పొడవైన బ్రిడ్జిగా పేరొందింది. ఈ బ్రిడ్జి నిర్మాణంలో అరవై ఒక్కవేల టన్నుల సిమెంటు, పన్నెండువేల టన్నుల ఉక్కు చేరి మొత్తం 1,74,000 ఘనమీటర్ల కాంక్రీటు ఉపయోగించబడింది. అరుణాచల్‌ప్రదేశ్‌లో ఉత్తరాన ఖామెంగ్, సుభాన్‌శ్రీ జిల్లాల నుండి దక్షిణ దిక్కుగా ఉండే నాగాలాండ్‌కు నది మీదుగా ఇది ఒక బ్రహ్మాండమైన మార్గం.

## పొడవైన కేక్


మలేసియాలోని కౌలాలంపూర్‌లో పెటలింగ్ జయా హిల్టన్ హోటల్‌లోని వంటవారు ఆ మధ్య ప్రపంచంలోనే అతి పొడవైన కేక్‌ను రూపొందించారు. నూట పదకొండు మీటర్ల పొడవైన పైన్‌ఆపిల్ కేకులో నాలుగు వేల గ్రుడ్లు, నూట ఐదు కిలోల చక్కెర, పదికిలోల మైదా, ముప్పై మూడు కిలోల కారన్‌ఫ్లోర్, మూడువందల యాభై కిలోల మీగడ, ఎనిమిది వందల అనాస పళ్ళు ఉపయోగించబడ్డాయి.

- రాధ

## సూక్ష్మక్రిములు

మనిషి శరీరంలో ప్రవేశించే ప్రయత్నం సూక్ష్మక్రిములెప్పుడూ చేస్తూనే వుంటాయి. గాలితో నాసికలోకి, నోటిలోకి, అలాగే శరీరంలోని నవరంధ్రాలద్వారా ప్రవేశించే ప్రయత్నం చేస్తాయి. శరీర రక్షణ వ్యవస్థ మనల్ని వాటినుంచి కాపాడుతుంది. మనిషి నోటి భాగంలో వున్నన్ని సూక్ష్మక్రిములు మరే భాగంలోనూ ఉండవని తేలింది.

- రాపేటి




ధైర్యం చెప్పుకోడానికి ఆమె చాలా కష్టాలు పడాల్సి వచ్చింది.

శరీరంలోని కంపనాలు తగ్గాయనిపించుకుని అప్పుడు మెల్లగా మంచం మీదకి చేరుకుంది. పడుకోబోతూ యథాలాపంగా పక్కకి చూసింది. మంచానికి అటు చివర, ఆమె భర్త గాఢనిద్రలో వున్నాడు. గాఢంగా నిట్టూర్చి కళ్ళు మూసుకుంది.

ఒకటి... రెండు... మూడు... క్షణాలు గడుస్తున్నాయి. మళ్ళీ ఎక్కడో గుడ్లగూబ వికృతంగా కూసింది. చప్పున కళ్లుతెరచి ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి అదిరిపడిందామె! తన మీదకి వంగి, ముఖంలోకి ముఖం పెట్టిచూస్తూ... భర్త! అతని కళ్ళు ఎర్రగా, చింతనిప్పుల్లా వున్నాయి. హడలిపోయిందామె. కెవ్వున కేక పెట్టబోయింది. అందుకోసమే తెరుచుకున్న ఆమె నోటిని అరచేయి అడ్డుపెట్టి మూసేశాడతను. మరింతగా భయపడింది.

''ఒద్దు... ఏం చెయ్యద్దు... నన్ను చంపద్దు'' అన్నట్టుగా తల అడ్డంగా తిప్పింది. అతన్ని వదిలించుకోవడానికి గిజగిజలాడింది. ఒదల్లేదతను. ప్రాణభయంతో రెపరెపలాడుతున్న ఆమె కళ్ళలో కళ్ళు పెట్టి సూటిగా చూశాడు. మూతి ఓ పక్కకి సాగదీసి వంకరగా నవ్వాడు. ఆ మొహంలో చెప్పలేనంత క్రౌర్యం. ఆ నవ్వులో హేళన! ఆ కళ్ళలో కసి!... వీలయితే... ఎలాగయినా ఆమెని చంపితీరాలన్న నిశ్చయం కదలాడింది.

తన ఆయుర్దాయం క్షణాల్లోకొచ్చేసిందని ఆమెకి నిర్ధారణ అయిపోయింది. చావు తెగింపుతో పెనుగులాడింది. బలమంతా ఉపయోగించి అతని చేతుల్ని లాగిపారేయాలని చూసింది. సాధ్యం కాక, బలం చాలక, ఎలుగ్గొడ్డులాంటి అతని పట్టు ముందు ఏడు మల్లెల ఎత్తున్న ఆమె ఓడిపోయింది.

ఆమె మెడచుట్టూ చుట్టుకున్న అతని చేతులు క్రమంగా బిగుసుకున్నాయి. ఊపిరందక, ఉక్కిరిబిక్కిరవుతూ మెల్లగా తల వాల్చేసిందామె!

అది చూసి... అతని కళ్ళలో పైశాచికానందం తళుక్కుమంది.

● ● ●

చల్లటి నీళ్ళు జల్లులా మొహం మీద పడడంతో ఠక్కున మెలకువ వచ్చిందామెకి. కళ్ళు తెరిచి చూసింది. తన మీదకి వంగి ముఖంలోకి ముఖం పెట్టి చూస్తూ... భర్త! కెవ్వున కేకపెట్టి దిగ్గున లేచి కూర్చుంది.

ఆమె అరిచిన అరుపుకి అదిరిపోయాడతను.

''ఏమైంది డియర్? ఎందుకలా అరిచావు?'' ఆందోళనగా అడిగాడు.

పక్కకి చేరిన భర్తవైపు వెర్రిగా చూసిందామె.

''అరె! ఏవిటా చూపు? ఏదో దెయ్యాన్నో, భూతాన్నో చూసినట్టు? అసలేమైంది?'' భుజం పట్టి కదుపుతూ అడిగాడు.

భయం భయంగా అతని ముఖంలోకి గుచ్చి గుచ్చి చూసింది.

ఆ కళ్ళు ఎర్రగా చింతనిప్పుల్లా లేవు. మొహంలో క్రౌర్యం లేదు. తనని తుదముట్టించాలన్న నిశ్చయమూ లేదు.

''ఏమైందంటే చెప్పకుండా ఏవిటలా చూస్తున్నావ్?'' అసహనంగా రెట్టించాడతను.

''మీ.. మీరు... నన్ను పీక పిసికి చంపేస్తుంటే... నాకు స్పృహ తప్పింది'' అక్షరం అక్షరం కూడబలుక్కుంటూ చెప్పింది.

ఆ మాటలు విని మొదట తెల్లబోయాడతను. తర్వాత పడీపడీ నవ్వాడు.

''నేనా! నిన్నా! చంపబోయానా?'' అంటూనే పొట్ట చెక్కలయ్యేలా నవ్వాడు.

''కలగన్నావ్! పీడకల... నువ్వు మంచం మీదపడి అరుస్తూంటే నేనే నీళ్ళు తెచ్చి మొహాన కొట్టాను. అదంతా కలే!'' నవ్వాపి ఆమెని దగ్గరగా తీసుకుంటూ అనునయంగా చెప్పాడు అతను.

కలా! నిజంగానే కలగందా తను? కలే అయితే గుండె ఇంత బలహీనంగా కొట్టుకుంటోందే? అయినా ఒకే కల రోజూ ఖచ్చితంగా అర్ధరాత్రి పన్నెండు గంటలకే రావడం ఏవిటి? గత పదిహేను రోజులుగా కొంచెం కూడా మార్పు లేకుండా తనలా వెంటాడడం ఏవిటీ? కొన్ని కొన్ని కలలు ఇలా రోజుల తరబడీ నెలల తరబడీ మనుషుల్ని వెంటాడుతాయా ఏవిటి?... ఆమెకెందుకో నమ్మకం కలగలేదు. అతన్ని వదిలించుకుని మెల్లగా లేచింది.

''ఎక్కడికి?'' అడిగాడతను.

''టాయిలెట్‌కి'' చెప్పి గబగబా అటు నడిచింది.

బాత్రూమ్‌లోకి వెళ్లి తలుపేసుకుంది. ఎందుకో మొహం కడుక్కోవాలనిపించింది. కడుక్కుని తలెత్తి చూసేసరికి ఎదురుగా అద్దంలో తన ప్రతిబింబం! ఆ ప్రతిబింబంలో మెడచుట్టూ అస్పష్టంగా వేళ్ళు బిగుసుకున్న గుర్తులు... వచ్చింది పీడకల కాదన్న నిజానికి చిహ్నాలుగా.

ఆమెకి విషయం అర్థమయ్యీ కానట్టుగా అవుతూంటే, ఆలోచిస్తూనే తలుపుతీసుకుని బయటికి వచ్చింది.

''హలో!'' భర్త పిలుపుతో ఆమె ఆలోచనలు చెదిరిపోయాయి. కళ్ళెత్తి అతనివైపు చూసింది.

అప్పుడే తెచ్చిన వేడి వేడి కాఫీ అందించాడతను.

అప్రయత్నంగా వాల్‌క్లాక్ వైపు చూసిందామె. తెల్ల

వారురూమున మూడు చూపిస్తోందది.

''ఇంత శ్రమెందుకు మీకు?'' కాఫీ అందుకుంటూ అంది.

''శ్రమేం ఉంది? తాగేసి పడుకో. హాయిగా నిద్రపడుతుంది. పడుకోబోయే ముందు వేడి కాఫీ తాగితే మంచి నిద్రపడుతుందిట! తెలుసా?'' అన్నాడతను నవ్వుతూ.

ఆమె బలవంతంగా నవ్వింది. కాఫీ గుటకేస్తుంటే గొంతులో నొప్పిగా అనిపించింది. ఇంకో రెండు గుటకలేశాకా కాఫీలో చిరు చేదు తెలిసింది. పది నిమిషాల క్రితం మనసులో పడ్డ అనుమానబీజం మొలకెత్తి మొక్కలా మారింది.

మౌనంగా కాఫీ తాగడం పూర్తి చేసింది. అతను చెప్పినట్టుగానే వెంటనే నిద్ర ముంచుకొచ్చింది. అలాగే మంచం మీదకి ఒరిగిపోయి గాఢనిద్రలోకి జారిపోయింది.

• • •

''గంగాధర్, సైకియాట్రిస్ట్'' బోర్డ్‌చూసి చివ్వున తల తిప్పి భర్తముఖం లోకి చూసిందామె.

అతను నిశితంగా ఆమెనే గమనిస్తున్నాడు.

''ఇదేవిటీ? ఇక్కడికి తీసుకొచ్చారు? ఇంటిదగ్గర వాతే సినిమాకి అని చెప్పారు కదా!'' వాడిగా ప్రశ్నించింది.

''సినిమాక్కూడా వెళదాం. కానీ ఒక్కసారి డాక్టర్‌కి చూపించుకుని...''

''...చూపించుకోవాల్సింది మీరా? నేనా?'' టక్కున అడిగింది అతని మాటలకి అడ్డు తగుల్తూ.

''నువ్వే'' మెల్లగా అన్నాడతను.

'నాకు సైకియాట్రిస్ట్ అవసరం లేదు. అసలు అనుచితంగా ప్రవర్తిస్తున్నది నేను కాదు. మీరే' గొంతెత్తి అరవాలనిపించింది. కానీ అరవలేదు. ఓ నిశ్చయానికి వచ్చినదానిలా గాఢంగా నిట్టూర్చి ముందుకి కదిలింది.

• • •

''మీ జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని భయంకర సంఘటన ఏదయినా జరిగిందా?'' డాక్టర్ ప్రశ్నించాడు.

తల అడ్డంగా తిప్పిందామె.

''పోనీ రాత్రిపూట పీడకలలేమైనా వస్తుంటాయా!'' అడిగాడు.

భర్త.. 'కల' అంటూ తనని మభ్యపెడుతున్న ఆ భయంకర సంఘటన కళ్ళముందు కదిలింది.

'అది... కలెలా అవుతుందీ? పచ్చి నిజం...' ఆలోచనల్లోంచి బయటపడి గాఢంగా నిట్టూర్చింది.

''రావు'' చెప్పింది.

''సరిగ్గా గుర్తు తెచ్చుకోండి. బాగా ఆలోచించి చెప్పండి. ఎవరో మిమ్మల్ని వెంటాడుతున్నట్టూ... మీదపడి పీక పిసుకుతున్నట్టూ...''

''ఆ... గుర్తొచ్చింది'' డాక్టర్ మాటలకి మధ్యలోనే అడ్డు తగిలింది.

''ఆ కల... ఎలా మొదలవుతుంది? కలలోని వ్యక్తులెవరు? వాళ్ళ రూపురేఖలేమైనా మీకు గుర్తున్నాయా?''

''అది...'అదసలు కలకాదు. నిజం! నా భర్తే కల అని మభ్యపెట్టి నన్ను చంపడానికి ప్రయత్నిస్తున్నాడు'' ఆవేశంగా అందామె.

''కారణం?'' ఆశ్చర్యాన్ని అణచుకుంటూ అడిగాడతను.

జవాబు చెప్పలేకపోయింది.

''మీది పెద్దలు చేసిన పెళ్ళా?''

''కాదు... రెండేళ్ళపాటు ఒకర్నొకరం అర్థం చేసుకున్నాకే పెళ్లి చేసుకున్నాం. మాది లవ్ మారేజ్''

''మనస్ఫూర్తిగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న మిమ్మల్ని చంపాలని మీ భర్త ఎందుకు ప్రయత్నిస్తాడు?''

మౌనంగా వుండిపోయిందామె.

''మీరు వెళ్ళి బయట కూర్చోండి'' డాక్టర్ చెప్పడంతో లేచి ఇవతలకి వచ్చేసిందామె. ఆమె రావడం చూసి ఆమె భర్త లోపలకి వెళ్ళాడు.

''ప్రస్తుతం మీ భార్య మానసికస్థితి బావుండలేదనిపిస్తోంది. ఏదో ఒక విషయంలో ఆమె అనుమానానికీ, అధికమైన ఆందోళనకీ గురవుతోంది. కొద్దిరోజుల పాటు ఆమెని అబ్జర్వేషన్‌లో వుంచాలి. మళ్ళీ మూడురోజుల తర్వాత తీసుకురండి. ఈలోపల కొన్ని మెడిసిన్స్ రాసిస్తాను. అవి వాడండి'' చెప్పి ఏవో మందులు రాసిచ్చాడతను.

అవి తీసుకుని బయటికి వచ్చేశాడు.


• • •


తన మానసిక స్థితి బావుండలేదా? తను పిచ్చిదా? అందువల్లే తను, భర్త తనను చంపడానికి ప్రయత్నిస్తున్నాడని భ్రమపడుతోందే తప్ప అది నిజం కాదా? అయితే మరి ఇలాంటి జబ్బులేవీ తనకి పెళ్ళికాక ముందు రాలేదెందుకని?

పుట్టింట్లో ఉన్నంతసేపూ సంపూర్ణ ఆరోగ్యవంతురాలిగా ఉన్న తను పెళ్లి కాగానే పిచ్చిది ఎందుకయింది? అసలు తనలో ఇలాంటి వికారాలు ఎందుకు కలుగుతున్నాయి? అన్నీ ప్రశ్నలే... ఒక్కదానికీ జవాబు రాలేదు.

ఆలోచనల్లోంచి బయటపడి కళ్ళు తెరిచి చూసిందామె. ఎదురుగా టేబిల్‌మీద... తన


## రావమ్మా! మధుబాలా...





సినిమాల్లో ఎలాగూ ఛాన్స్‌లు దొరకని వాళ్ళంతా టి.వి. రంగంలోకి వచ్చి టి.వి. సీరియల్స్‌పై పడ్డారని మనందరికీ తెల్సు. ఆ దారిలోనే మధుబాల కూడా వచ్చింది. అయితే ఆమె అడిగిన రెమ్యూనరేషన్ మాత్రం ఎవ్వరూ ఇవ్వలేదట. కేవలం ఎపిసోడ్‌కి 500 నుండి 1000 రూపాయలు మాత్రమే కదా ఇచ్చేది. కొందరు ఈ రెమ్యూనరేషన్ నచ్చక వెనక్కిపోతున్నారు. అందుకే కొత్త కొత్త ముఖాన్ని మనం టి.వి.లో చూస్తున్నాం!

\- విరాజి





## చదువు

''ఏమోయ్! మీ అబ్బాయి ఇంకా చదువు'కొం'టున్నాడా?'' చిన్ననాటి స్నేహితుడిని అడిగాడు అప్పారావు.

''అబ్బేలేదు. ఓ కాన్వెంట్ స్కూల్‌పెట్టి చదువు అమ్ముకుంటున్నాడు'' చెప్పాడు పాపారావు.

## పెంపకం

''ఏమిటీ! మీ ఇంట్లో కుక్కను పిల్లి తరుముతోంది?'' అడిగాడు రవి.

''ఆ...మరేంలేదు. కుక్కను నేను పెంచుతుంటే పిల్లిని మా ఆవిడ పెంచుతోంది'' చెప్పాడు గిరి.

## ప్రేమలేఖ

''పిసినారి రాంబాబు నీకు ప్రేమలేఖ రాశాడట కదా! ఇంతకీ ఏం రాసాడు?'' అడిగింది హేమ.

''రాశాడుగానీ... లెటర్ చివర్న 'నువ్వు నన్ను ప్రేమించకపోతే ఈ లెటర్ మీ చెల్లెలుకు ఇవ్వు' అని రాసాడు'' చెప్పింది రాధిక.

## ప్రాక్టీస్

''మీరు ఈ రోజు చాలా తేలిగ్గా దగ్గుతున్నారు కదూ?'' అన్నాడు డాక్టర్.

''అవునండీ! రాత్రంతా ప్రాక్టీస్ చేసి తేలికగా దగ్గడం నేర్చుకున్నాను'' చెప్పాడు బ్రహ్మానందం.

**-శ్రీనివాస్ వల్లాల** (నారాయణఖేడ్)

## ఇనాం

''ఏమండీ! సిమెంటు కుంభకోణంలో పదికోట్లయినా ఇచ్చేవారుగా! ఐదుకోట్లే తీసుకున్నారెందుకు?'' అంది భార్య.

''లంచాలు తీసుకోవడం నాకిష్టముండదే. ఏదో ఇనాంగా ఐదుకోట్లే తీసుకున్నా'' చెప్పాడు మంత్రి.

**- కలవకుంట్ల గురునాథపిళ్ళై** (మదనపల్లి)

మానసికస్థితి సరిగా లేనట్టు నిర్ధారిస్తూ డాక్టర్ రాసిచ్చిన మందులు. ఉత్తరోత్తరా తను పిచ్చిదని లోకానికి నిరూపించడానికి బలమైన ఆధారాలు. ఆమెకెందుకో కసిగా అనిపించింది.

దిగ్గున మంచం మీంచి లేచి రెండంగల్లో టేబిల్ దగ్గరికి చేరుకుంది. అక్కడున్న మందులన్నీ తీసి కిటికీలోంచి బయటికి విసిరేసింది. అక్కడితో ఆగలేదామె!

ఇంటికి తాళంవేసి బయటపడింది. తనని తాను రక్షించుకోవడం కోసం ఏం చెయ్యాలో అన్నీ చేసి రెండుగంటల్లో తిరిగి ఇంటికి చేరుకుంది. అప్పుడు ఆమెకి ప్రాణం కుదుట పడింది. 'తాడో పేడో తేలిపోతుంది. ఇవాళే!' అనుకుందామె.

• • •

గడియారం టంగు టంగున పన్నెండు కొట్టింది. గాఢ నిద్ర నటిస్తున్న ఆమె గుండె గుభిల్లుమంది. ఓరగా కళ్ళు తెరిచి కిటికీ వైపు చూసింది. కిటికీ అవతల లీలగా ఓ ఆకారం మెదిలినట్టయింది. చటుక్కున చూపులు తిప్పి పక్కనే పడుకున్న భర్తవైపు చూసింది.

వాల్‌క్లాక్ కొట్టిన గంటల శబ్దానికి కాబోలు, అటు తిరిగి పడుకున్న అతన్లో కొద్ది పాటి కదలిక. అతను లేస్తున్న విషయాన్ని గ్రహించి చటుక్కున కళ్ళు మూసుకుంది.

అటు కదిలీ ఇటు కదిలీ మెల్లగా బెడ్‌మీంచి లేచాడతను. పక్కనే నిశ్చలంగా నిద్రపోతున్న భార్యవైపు చూశాడు.

నెమ్మదిగా అటు జరిగి ఆమెమీద చెయ్యి వేశాడు. చటుక్కున కళ్ళు తెరిచిందామె. ఆ కళ్ళలో కదలాడుతున్న భయాన్ని గమనించి వంకరగా నవ్వాడతను. ఆ వెంటనే రెండు చేతులూ సాచి ఆమె మెడని పట్టుకున్నాడు.

భర్త పట్టునుంచి తప్పించుకోవడానికి పెనుగులాడుతూనే అప్రయత్నంగా కిటికీవైపు చూసిందామె. అక్కడ... చీకటి వెలుగుల మిశ్రమంలో లీలగా ఓ ఆకారం!

ఆమె మెడచుట్టూ అతని చేతులు బిగుసుకోవడం ప్రారంభించాయి. సరిగ్గా అప్పుడే తళుక్కున ఓ మెరుపు మెరిసింది. అదిరిపడి ఆమెని వదిలేశాడతను. గబుక్కున కిటికీ దగ్గరకి పరుగెత్తి బయటికి చూశాడు. ఏమీ కనబడలేదు. తమ బెడ్‌రూమ్‌కి దగ్గరగా ఉన్న స్ట్రీట్‌లైట్ సరిగా పనిచేయడం లేదు కాబోలు, వెలిగీ... ఆరీ! వెలిగీ... ఆరీ! దాన్ని చూసే తను భ్రమపడి వుండాడనిపించింది.

గాఢంగా నిట్టూర్చి వెనక్కితిరిగి, అక్కడ కనబడిన దృశ్యం చూసి వెయ్యి ఓల్టుల షాక్ తగిలినట్టుగా అదిరిపడ్డాడతను.

బెడ్ దగ్గర, అపర కాళిలా ఆమె! ఆ వెనుక... ఆమె తండ్రి... అన్నగారూ!... పోలీస్ ఇన్స్‌పెక్టర్... ఫొటోగ్రాఫర్!

''ఏ... ఏమిటిదంతా?'' కంగారుగా ప్రశ్నించాడు.

''నిన్ను శ్రీకృష్ణ జన్మస్థానానికి పంపించడానికి ఏర్పాట్లు'' కటువుగా అన్నాడామె తండ్రి.

కంగారుగా ఆమెవైపు చూశాడతను. ఆ చూపుల్లో 'నిజమా!' అన్న ప్రశ్న.

'అమాయకంగా కనిపించే నువ్వు ఇంత సాహసం ఎలా చెయ్యగలిగావు?' అన్న అపనమ్మకం.

అతని చూపుల్ని లెక్కచేయలేదామె.

''చెప్పు! ఎందుకు చేస్తున్నావిదంతా? నాకు మానసికంగా స్థిమితం లేదని నిరూపించడం కోసం ఎందుకు ప్రయత్నిస్తున్నావు?'' రెండే రెండంగల్లో అతన్ని చేరుకుని షర్ట్ కాలర్ పట్టి గుంజుతూ ఆవేశంగా అడిగింది.

ఇక ఉపేక్షించలేకపోయాడతను.

బలమంతా ఉపయోగించి ఆమెని గట్టిగా విదిలించాడు. ఆ విసురుకి దూరంగా వెళ్ళి పడిందామె.

''అవును! చేశాను. ఎందుకంటే... నిన్ను నేను వదిలించుకోవాలి. నీనుంచి నాకు విడాకులు కావాలి. మామూలుగా అడిగితే నువ్వు ఇవ్వవని, నిన్ను బెదిరించి భయపెట్టే వాటిని పొందాలనుకున్నాను. నిన్ను తొందరపడి పెళ్ళి చేసుకున్నందుకు నేను చాలా నష్టపోయాను. కట్నాలూ, కానుకలూ ఇవేవీ నాకు ముట్టలేదు సరికదా, ఉత్తరోత్తరా నీవైపు నుంచీ నాకొచ్చే ఆస్తిపాస్తులు కూడా ఏవీ లేవు! అందుకే, మరో పెళ్ళి చేసుకోవడం, ఆ పెళ్ళి ద్వారా నేననుకున్నవన్నీ సాధించుకోవడం కోసమే ఇంత నాటకం ఆడాను. కానీ... కాలం నాకు సహకరించలేదు. అందుకే... ఓడిపోయాను'' ఆవేశంగా అన్నాడతను.

తెల్లబోయిందామె!

డబ్బుకోసం ఎక్కువగా ఆలోచించి అతి తెలివితో మనసు పాడు చేసుకుని ఆ స్థితిలో తను పిచ్చిదని నిరూపించడానికి ప్రయత్నించి, చివరికి తనే పిచ్చివాడుగా నిలబడిన భర్త పరిస్థితికి జాలిపడింది.

ఏదేమైనా ఆడదాన్ని అబలగా భావించి వాళ్ళ జీవితాల్లో ఆటలాడుకునే ఇలాంటి వాళ్ళని వదలకూడదు. గట్టిగా శిక్షించాల్సిందే! అనుకుంటూ పోలీసుల వెంట నడుస్తున్న భర్తని చూసి గాఢంగా నిట్టూర్చిందామె!

★

